'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

బంగ్లా సంక్షోభం

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనను షేక్ హసీనా వాజెద్ ఉక్కుపాదంతో అణచివేసేందుకు జరిపిన ప్రయత్నం బెడిసికొట్టింది. శాంతిభద్రతలు అదుపు తప్పి దేశం సంక్షోభంలోకి కూరుకుపోవడంతో సైన్యం రంగప్రవేశం చేసి అల్టిమేటం ఇవ్వడంతో ప్రధాని పదవి నుంచి ఆమె వైదొలగడమే కాకుండా దేశం విడిచి వెళ్లిపోయారు. అరాచకం ప్రబలిన నేపథ్యంలో బంగ్లా సైన్యాధినేత వాకర్ ఉజ్జమాన్ దేశ పరిపాలనా పగ్గాలను తన చేతుల్లోకి తీసుకున్నారు. ఉద్యోగాల్లో కోటాకు వ్యతిరేకంగా గత జూన్‌లో మొదలైన నిరసనలు క్రమంగా తారస్థాయికి చేరుకున్నాయి. ప్రభుత్వ ప్రతిస్పందన కూడా దారుణంగా ఉండటంతో దేశ వ్యాప్తంగా హింసాకాండ ప్రజ్వరిల్లింది. రాజధాని ఢాకా సహా పలు నగరాలు నిరసనజ్వాలలతో అట్టుడుకుతున్నాయి. అల్లర్లు, పోలీసు కాల్పుల్లో చాలామంది యువకులు ప్రాణాలు కోల్పోయారు. నిన్నటి ఆదివారం ఒక్కరోజే 100 మందికి పైగా మరణించారు. గత నెల నుంచి ఇప్పటివరకు 300కు పైగా మరణాలు సంభవిస్తే అందులో 32 మంది 18 ఏండ్లలోపు పిల్లలే. భద్రతా దళాల చర్యల్లో మరో 25 వేలమంది గాయపడి చికిత్స పొందుతున్నారు. నర్సింగ్‌దీ జైలుపై ఆందోళనకారులు దాడిచేసి 500 మందిని విడిపించుకుపోవడం, రంగపూర్‌లోని పోలీసు క్యాంపుపై 4 వేల మంది నిరసనకారులు దాడిచేయడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ఆగస్టు 4న జరిగిన సహాయ నిరాకరణ ఆందోళన హింసాత్మకంగా పరిణమించింది.

1971 బంగ్లా విముక్తి యుద్ధం తర్వాత ఇంతటి తీవ్రస్థాయిలో హింసాకాండ ఎన్నడూ చెలరేగలేదంటున్నారు. ఆందోళనకారులతో మంత్రులు చర్చలు జరుపుతుంటే పాలక అవామీ లీగ్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా దాడులకు దిగడం, భద్రతాదళాలు 11 వేలమందికి పైగా ఆందోళనకారులను అరెస్టు చేసి దేశాన్ని జైలుగా మార్చడమే ఈ ప్రజాగ్రహానికి కారణంగా భావించాల్సి ఉంటుంది. హసీనా తండ్రి ముజీబ్ నేతృత్వంలో సాగిన విముక్తి పోరాటంలో పాల్గొన్నవారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం కోటా ఉండేది. ఇతర కోటాలూ అమల్లో ఉండేవి. ప్రజా వ్యతిరేకత కారణంగా హసీనా ప్రభుత్వం మొత్తం అన్ని రిజర్వేషన్లను 2018లో రద్దు చేసింది. ఇటీవల ఈ నిర్ణయాన్ని ఢాకా హైకోర్టు కొట్టేయడంతో మళ్లీ రిజర్వేషన్లు అమలుచేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో కోటా వ్యతిరేక ఆందోళన ఊపందుకున్నది. బంగ్లా విముక్తి యుద్ధం రోజుల్లో పాకిస్థాన్ తరఫున బంగ్లాదేశీయులపై అరాచకాలకు పాల్పడిన 'రజాకార్ల'తో కోటా వ్యతిరేక నిరసనకారులను ప్రధాని షేక్ హసీనా పోల్చడంపై కూడా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమైంది. పైగా 2018, 2024 ఎన్నికల్లో ప్రతిపక్షాలను దిగ్బంధనానికి గురిచేసి షేక్ హసీనా విజయం సాధించారనే విమర్శలు వచ్చాయి. తాజా ఘటనల నేపథ్యంలో బంగ్లాదేశ్ మరోమారు సైనిక పాలన కిందకు వెళ్లడం విషాదకరం. దేశంలో శాంతిభద్రతలను పునరుద్ధరించడం అనేది సైనిక ప్రభుత్వం తక్షణ కర్తవ్యం కావాలి. సుదీర్ఘకాలం సైనిక పాలకుల కింద మగ్గిన చరిత్ర బంగ్లాదేశ్‌కు ఉంది. వాకర్ ఉజ్జమాన్ కూడా ఎర్షాద్, జియావుర్ రహమాన్ తరహాలో మరో సైనిక నియంతగా మారుతారా లేక ఎన్నికలు జరిపించి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతారా? అనేది వేచిచూడాలి.

మేధావులు ఎందుకిట్లా అయ్యారు?

ఎందుకిట్లా అయ్యారని కేవలం మేధావుల గురించి ఆలోచించటం వల్ల ఉపయోగం లేదు. వారి విషయం మాత్రమే ఆలోచించటంతో సమాధానం కూడా దొరకదు. ఎందుకంటే వారిని పరిస్థితులు అట్లా తయారుచేస్తున్నాయి. పరిస్థితులు అనారోగ్యకరంగా ఉన్నట్లయితే వాటికి భిన్నంగా ఆలోచించి సమాజానికి మార్గదర్శనం చేయటం కదా మేధావుల బాధ్యత అనే సందేహం కలగవచ్చు. అది నిజమే. ఆ విధంగా చేసినవారు అనేకులు కన్పిస్తారు. వారు సమాజాన్ని చైతన్యపరిచి సంఘ సంస్కరణల నుంచి విప్లవాల వరకు అనేక మార్పులకు దోహదం చేశారు. కనీసం ఆ దిశగా అలుపు లేని కృషిని తమ జీవితాంతం వరకు చేశారు.

టంకశాల అశోక్

తెలంగాణ విషయానికి వస్తే పరిస్థితి ఏమిటి? అటువంటి మేధావుల తరం బాలగోపాల్‌తో ముగిసిపోయింది. వరవరరావు, గద్దర్‌లను ఈ పరిధిలోకి తీసుకురావటం లేదు. వారు విప్లవకారులు. మెయిన్‌స్ట్రీమ్ అనబడే పరిధిలోకి ఇమడని వారు గనుక. అందువల్ల బాలగోపాల్ తర్వాత మనకిక మిగిలింది శూన్యం. ఇంకా మేధావులమని చెప్పుకునేవారు, లేదా చెప్పబడేవారు, సమాజాన్ని చైతన్య పరుస్తున్నది, ఉత్తేజపరుస్తున్నది ఏమీ కన్పించదు. అంతేకాదు. రొటీన్ గానుగ బండ వలె మిగిలిపోయారు.

ఇందుకు సమాధానం, పైన అనుకున్నట్టు, కేవలం వారి గురించి ఆలోచించటం వల్ల దొరకదు. ముఖ్యంగా వారు రొటీన్‌లో గానుగ బండ వలె మిగిలిపోయారు తప్ప, రొటీన్‌కు భిన్నంగా ఆలోచించి పనిచేసేవారు కాకుండాపోయారు గనుక. అటువంటప్పుడు వారిని ఏ పరిస్థితులు అట్లా తయారుచేస్తున్నాయంటూ, సమాధానాన్ని పరిస్థితులలో వెతకాలి. మ్యాన్ అండ్ హిజ్ టైమ్స్ అనే మాట ఒకటుంది గదా. అదే పద్ధతిలో ప్రస్తుతపు సోకాల్డ్ మేధావులు అండ్ దెయిర్ టైమ్స్ అన్న మాట. అట్లా అర్థం చేసుకున్నప్పుడు వీరిపై వ్యతిరేకతకు బదులు సానుభూతి కలుగుతుంది.

ఈ స్థితికి ఆరంభాన్ని బహుశా 1991లో సోవియెట్ యూనియన్ పతనం నుంచి వెతకాలి. వర్తమాన తరాలకు సంబంధించిన సామాజిక మేధావులలో స్థూలంగా మూడు విధాలైన వారున్నారు. ఈ చర్చలోకి అకడమిక్ మేధావులను తీసుకురావటం లేదు. కనుక సామాజిక మేధావులంటున్నాము. ఆ ముగ్గురిలో ఒకరు, మితవాద భావనలు కలవారు. వారు సామాజిక చైతన్యాలు, పరివర్తనల గురించి ఆలోచించేవారు కాదు గనుక వారిని కూడా వదిలివేద్దాము. మిగిలిన ఇద్దరిలో ఒకరు పూర్తిగా వామపక్ష భావజాల పరిధిలోని వారు కాగా, మరొకరు ఉదారవాదులు, సాధారణ రూపంలో అభ్యుదయవాదులు. వామపక్ష పరిధిలోని వారిలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలను, విప్లవ పార్టీలను అనుసరించే వారుంటారు. వాటిమధ్య తేడాలలోకి ఇక్కడ పోవటం లేదు. కాకపోతే ఒక మాట మాత్రం అనుకోవచ్చు. ఉభయ కమ్యూనిస్టులను అనుసరించే మేధావులలోనూ అనేకానేకులు, ఆ పార్టీల క్షీణత కారణంగా ఉదారవాదులుగా, సాధారణ అభ్యుదయవాదులుగా మారిపోతున్నారు. కొందరు అంతకన్నా కిందిస్థాయికి పోతున్నారు. అయినప్పటికీ ప్రస్తుత చర్చ కోసం వారిని కూడా పక్కకు పెడదాము. ఇంకా చెప్పాలంటే, ఈ ప్రభావాలు క్రమంగా విప్లవ పార్టీల అనుయాయ మేధావులపైన సైతం పడటం కనిపిస్తున్నది. మొత్తానికి ఈ రకరకాల వామపక్షీయులందరినీ పక్కన ఉంచితే మిగిలేది ఉదారవాదులు, సాధారణ అభ్యుదయవాదులు.

తక్కినవారిని వదిలివేసి ప్రత్యేకంగా వీరిగురించి చర్చించటం ఎందుకన్నది ప్రశ్న. అందుకు కొన్ని కారణాలున్నాయి. అవి సమాజ స్వభావానికి సంబంధించినవి. సమాజం, లేదా సాధారణ ప్రజలు సాధారణ సమయాలలో ఇటు మితవాదంతోనో, అటు అతివాదంతోనో ఆలోచించరు. మధ్యస్థంగా ఉంటారు. వారిలోనూ ఉదారవాదం, మంచితనం, ఆ మేరకు అభ్యుదయ లక్షణాలుంటాయి. అసాధారణ పరిస్థితులు ఏర్పడినప్పుడు వాటిని బట్టి మితవాదులు, లేదా అతివాదులు అవుతారు. అనగా, సర్వసాధారణంగా వారి ఆలోచనా ధోరణికి, ఉదారవాద-అభ్యుదయవాద మేధావుల ధోరణికి దగ్గరితనం ఉంటుంది.

> **ఒకవిధంగా వారు సహజమిత్రులన్న మాట. అందువల్ల, సాధారణ సమయాలలో ప్రజలు మితవాద మేధావులను, అతివాద మేధావులను కాదని, ఉదారవాద-అభ్యుదయ వాద మేధావుల మధ్యే మార్గానికి ఎక్కువ విలువ ఇస్తారు. దానిని అనుసరిస్తారు. ఆ కారణంగానే ప్రస్తుత సందర్భంలో ఈ వర్గం గురించి చర్చిస్తున్నాము. ఇప్పుడు తెలంగాణలో మితవాదం లేదు, అతివాదం లేదు. మధ్యేవాద పరిస్థితులు, ఆలోచనా ధోరణులే ఉన్నాయి.**

ఈ మాటలు చెప్పుకొన్నాక, కొద్దిగా నేపథ్యాన్ని చూడాలి. తెలంగాణలో కొంతకాలం కిందటి వరకు అతివాద ఆలోచనలు (ఇందులో సీపీఐ నుంచి నక్సలైట్ల వరకు అందరినీ కలిపి స్థూలంగా మాట్లాడుతున్నాము) ప్రబలంగా ఉండేవి. అన్యాయాలకు వ్యతిరేకంగా, ప్రత్యేక రాష్ట్రం కోసం తీవ్ర భావనలతో జరిగిన సుదీర్ఘ ఉద్యమాన్ని కూడా ఈ వరుసలోనే చేర్చుతున్నాము. ఈ రెండు జరిగినంతకాలం వాటి ప్రభావాలు ఉదారవాద, సాధారణ అభ్యుదయవాద, మధ్యేమార్గ మేధావులపై ఉండేవి. వారి వ్యవహరణ అందుకు అనుగుణంగా ఉండేది. కనుక కేవలం మధ్యేమార్గంలో గాక, కొంత ఎడమకు మొగ్గి ఆలోచించేవారు. మరొక మాటలో చెప్పాలంటే అప్పటిదంతా ఒక విధమైన ప్రత్యేక వాతావరణం గనుక వారి తీరు అదే పద్ధతిలో ఉండేది. అయితే వారు స్వయంగా తమ ఉదారవాద స్వభావాన్ని బట్టి గాని, సాధారణ అభ్యుదయ ధోరణిని బట్టి గాని, మితవాదుల వలెనో, అతివాదుల వలెనో, నిర్దిష్టమైన, ఖచ్చితమైన భావ ధోరణులు గలవారు కాదు. ఉదారవాదులు, సాధారణ అభ్యుదయవాదుల స్వభావం ఎప్పుడైనా అంతే. అందులోనూ, పైన అనుకున్నట్టు, అతివాదం బలంగా ఉండినంతకాలం ఆ ప్రభావాలకు లోనైన వారు, అది బలహీనపడటంతో పక్కకు జరిగి సాధారణ మధ్యేమార్గ ధోరణికి దగ్గరవుతారు. తమ గతంతో వారికి బంధం బలహీనపడుతుంది.

తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్నది అదే. మధ్యేమార్గ ధోరణికి దగ్గరకావటమంటే అనివార్యంగా తాము నిన్నటిస్థాయి అభ్యుదయవాదానికి దూరంగా జరిగి, సమాజంలో, రాజకీయాలలో, పరిపాలనలో జరిగే పరిణామాల పట్ల అంతే సాధారణంగా ఆలోచించటం, వ్యవహరించటమన్నమాట. వారిపై వామపక్ష భావజాల ప్రభావాలు బలహీనపడటం మొదటి దశ. పైన చెప్పుకున్నట్టు బాలగోపాల్ మరణం అందుకు తుది ఘడియ. వరవరరావు వంటి వారు క్రియాశీలతలో లేరు. తెలంగాణ భావజాలం కనీసం ఉద్యమకాలంలో వలె లేదు. ఇటువంటి స్థితిలో, కేవలం ఇసుక భూమి వంటి పునాదులపై నిలిచే మధ్యేమార్గ, ఉదారవాద, సాధారణ అభ్యుదయవాద మేధావి తరగతి రకరకాల బలహీనతలకు, అయోమయాలకు, ఊగిసలాటలకు లోనవుతూ, చుక్కాని లేని పడవ వలె సాగుతుంటుంది. వారికి కొత్త రాజకీయ సానుభూతులు మొదలవుతాయి.

> **ఈ తరగతి మేధావి వర్గం మనకు ప్రస్తుతం కనిపిస్తున్నది ఆ విధంగానే. వివిధ పరిస్థితుల మధ్య వారొక కొత్త చట్రంలో బిగుసుకుని పోయారు. అందువల్ల బీఆర్ఎస్ పాలననైతే యథేచ్ఛగా విమర్శించారు. కనీసం ఒక్క మంచినైనా గుర్తించలేని నిజాయితీరాహిత్య స్థితికి పతనమయ్యారు. వరుసగా కనిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలలో ఒక్కదానినైనా ఎత్తిచూపగల నిజాయితీ లేని వారిగా తెలంగాణ ప్రజల దృష్టిలో మిగులుతున్నారు.**

అందుకు సంబంధించిన ప్రశ్నలు ఏవైనా ఎదురైతే కళ్లు వాల్చుకుని మొహం దింపుకోవటం, వినిపించీ వినిపించని అరకొర మాటలతో నీళ్లు నమలటం మినహా మరొకటి చేయలేని బలహీనత ఏదో వారిని ఆవరించింది. ప్రభుత్వం రానున్న రోజులలోనైనా ప్రజలకిచ్చిన హామీలు అమలుపరిచి, బాగా పాలించి, తమను తిరిగి తల ఎత్తుకునేట్టు చేయకపోతుందా అనే ఆశలతో జీవిస్తున్నారు. కానీ, మేధావులు చేయవలసింది అదికాదు కదా? మొన్నటివరకు బీఆర్ఎస్ పట్ల చేసింది కూడా అది కాదు. అయితే, వారిని ఈ విధంగా తయారుచేసింది పరిస్థితులని, అందుకు భిన్నంగా వ్యవహరించగల శక్తిని వారు కోల్పోయారని, ఒక కొత్త చట్రంలో ఇరుక్కున్నారని, అదెట్లా జరిగిందోనని పైన చెప్పుకున్నాము. చివరగా, తమపై సమాజం ఒక ఆశ పెట్టుకోవచ్చునేమో చూడాలి. నేడు కానట్టయితే రేపు తెలంగాణ సమాజం తిరిగి తన చైతన్యాన్ని తెచ్చుకున్న పక్షంలో, కనీసం ఆ ప్రభావంతో ఒత్తిడితో వీరు కూడా తమ ప్రస్తుత చట్రం నుంచి బయటపడవచ్చునా?

నేడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి

'తెలంగాణ వాదానికి అసలు సిసలు సిద్ధాంతకర్తలు ప్రజలే. ఫణికర మల్లయ్యను మించిన సిద్ధాంతకర్త ఎవరుంటరు?' అని ప్రకటించిన దార్శనికుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్. 1952 నుంచి తుదిశ్వాస విడిచేదాకా మూడు దశల ఉద్యమానికి కలం.. గళం జమిలీ సాగిన కార్యశీలత నిత్యస్మరణీయం.

తెలంగాణకు నిత్యస్ఫూర్తి

నూర శ్రీనివాస్



తెలంగాణకు జరిగిన అన్యాయాలపై శ్రీకృష్ణ కమిటీకి ఆమూలాగ్రం అందజేసిన ఉద్యమ గ్రంథం జయశంకర్ సార్. ఆయన అనుసరించి.. ఆచరించి ప్రవచించిన స్వీయ రాజకీయ అస్తిత్వవాదం అనివార్యతే తెలంగాణకు రక్షణ కవచం. తెలంగాణ సాధన స్వప్నాన్ని సాకారం చేసుకోవటానికి ఆరాటపడుతూనే అనేక శిఖరాలను అధిరోహించిన విద్యావేత్త ఆయన.

కాకతీయ విశ్వవిద్యాలయానికి జయశంకర్ సార్ వైస్‌చాన్స్‌లర్‌గా నియమితులు కాగానే ఆయనను సన్మానిద్దామని విద్యావంతులు, అధ్యాపకులు, ఆయనను అభిమానించే బుద్ధిజీవులు ప్రజాకవి కాళోజీని వెంటబెట్టుకొని వెళ్లారు. 'సన్మానం వద్దు' అని వారిని నిలువరించటమే కాకుండా అందరినీ కూర్చోబెట్టుకొని 'నేను వీసీగా ఉన్నకాలంలో ఏమైనా తప్పులు జరిగితే కాళోజీ అధ్యక్షతన ఒక సమావేశం పెట్టండి. దానికి నన్ను పిలిచి కడిగిపారేయండి' అని పేర్కొన్న విషయాన్ని వివరిస్తూ జయశంకర్ సార్ నిజాయితీ, చిత్తశుద్ధిని ప్రొఫెసర్ లక్ష్మణ్ అనేక సందర్భాల్లో ఉదహరించారు. అలాగే ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఒక సీనియర్ మంత్రి తన అనుచరుడికి విశ్వవిద్యాలయంలో ఉద్యోగం ఇవ్వాలని సిఫారసు లేఖ పంపిస్తే.. ఆ లేఖను చదివి లేఖ తెచ్చిన వ్యక్తి ముందే చించి చెత్త బుట్టలో వేశారట. ఆ వ్యక్తి ఒక్కసారిగా ఖిన్నుడై.. 'మంత్రిగారికి ఏం చెప్పమంటారు?' అని అడిగితే 'నేను ఏం చేశానో అదే చెప్పు' అని చెప్పిన ముక్కుసూటితత్వం జయశంకర్ సార్‌ది.

వివక్షకు, దోపిడీకి గురైన ప్రజలు పోరాట పంథాను అనుసరించినప్పుడు రాజకీయ పార్టీలు పుడతాయి. తెలంగాణ కోసం అట్లా ఉద్భవించిన పార్టీలు, ఆ పార్టీల నాయకుల్లో ఉన్న చిత్తశుద్ధి, లక్ష్యశుద్ధి ఆధారంగానే గమ్యాగమ్యాలు ఆధారపడి ఉంటాయన్నది జయశంకర్ సార్ అనుభవసారం. 'నేను అన్ని పార్టీలను చూసిన. తెలంగాణ అన్న ప్రతీ నాయకుడి తలుపు తట్టిన. కానీ, నాకు చంద్రశేఖర్‌రావులో లక్ష్యశుద్ధి నచ్చింది. అందుకే ఆయనతో ర్యాలీ అవుతున్న. అందులో తప్పేముంది' అని జయశంకర్ సార్ ప్రశ్నించిన సందర్భాలనేకం. జయశంకర్ సార్‌ను కేసీఆర్ నుంచి వేరు చేయాలని అనేక శక్తులు ప్రయత్నించి విఫలమయ్యాయి. 'ప్రజాస్వామిక వ్యవస్థలో రాజకీయ పార్టీలు, వాటికి ప్రాతినిధ్యం వహించే నాయకులు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రవర్తించకపోగా అవకాశవాద అధికార రాజకీయాలకు పాల్పడితే ప్రజలు చేయవలసిందేం ఉంటుంది? బానిసలుగా బతకటమా? లేక న్యాయం కోసం పోరాడటమా? ఘనమైన పోరాటాల చరిత్ర గల తెలంగాణ ప్రజలు ఏ పార్టీ సమర్థించినా, సమర్థించక పోయినా తమ న్యాయ పోరాటాన్ని ఐదారు దశాబ్దాల నుంచి కొనసాగిస్తూనే ఉన్నారు. లక్ష్యసాధన జరిగే వరకు కొనసాగిస్తూనే ఉంటారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. పోరాటాన్ని ముందుకు తీసుకుపోతున్నది. ముందుకు తీసుకెళ్లే సత్తా కేసీఆర్‌లో ఉందని నా అనుభవం చెప్తున్నది' అని చెప్పిన జయశంకర్ సార్ 2001 నుంచి కడదాకా కేసీఆర్‌తోనే నడిచారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర దశాబ్ది ముంగిట్లో జయశంకర్ సార్ ఉండి ఉంటే ఏం వ్యాఖ్యానించేవారు? ఈ పదేండ్లకాలంలో రాజకీయ నాయకులు, బుద్ధిజీవులు, మేధావులు, సామాజిక అధ్యయనశీలురు అనుసరిస్తున్న వైఖరిని ఆయన ఎలా విశ్లేషించేవారు? అన్నది ఆసక్తిదాయకం. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ క్రీడా నేపథ్యాలు, వెలిబుచ్చుతున్న వైఖరులు కొత్తవేమీ కాదు. తెలంగాణ పట్ల ఉమ్మడి పాలకులు అందించిన అనుభవగ్రంథంలోని పాఠాలే ఇప్పటి పాలకులు వల్లె వేస్తున్నారా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. చరిత్రనూ గుర్తుచేస్తున్నాయి. నాడు తెలంగాణ ఉద్యమ తీవ్రతను సహించక 'ఒకవేళ తాము హైదరాబాద్‌ను విడిచి వెళ్లవలసి వస్తే ఆ నగరాన్ని తగులబెట్టిపోతాం' అని దబాయించినట్టే వాతావరణం నెలకొన్నది. ఇటువంటి సందర్భంలో 'బాధిత సమాజం గళం విప్పినప్పుడు విద్యావంతులు కలం పట్టాలి' అన్న ఆచార్య రావాడ సత్యనారాయణ ఉద్బోధను జీవితాంతం ఆచరించిన జయశంకర్ సార్ నడిచిన దారిని అనుసరించటమే తెలంగాణ ప్రజలు ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి..!

అదే పోరాట పంథా

టి.విఠల్

మొన్న తెలంగాణ ఉద్యమంలో ఉవ్వెత్తున ఎగసిన కెరటం.. నిన్న అధికారంలో తెలంగాణను సమున్నత శిఖరాలకు చేర్చిన సంకల్పం.. నేడు ప్రతిపక్షంలో ప్రజల గొంతుకను బలంగా వినిపిస్తున్నది. హోదా ఏదైనా.. పరిస్థితి ఎలాంటిదైనా.. అందులో ఒదిగిపోయి ప్రతిక్షణం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం పరితపించే సమర్థ నాయకత్వానికి నిలువెత్తు ప్రతీకగా కల్వకుంట్ల తారకరామారావు నిలుస్తున్నారు. నాడు తెలంగాణ సాధన కోసం గర్జించిన గళం.. నేడు తెలంగాణ ప్రజల హక్కుల కోసం మరోసారి నినదిస్తున్నది. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను అడుగడుగునా నిలదీస్తున్నది.

నాడు స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా సాగిన మహోద్యమంలో అడుగడుగునా గులాబీ సైనికులతో కలిసి కదంతొక్కారు కేటీఆర్. సమైక్య రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలకుల అన్యాయాలను ఎక్కడికక్కడ ఎండగట్టారు. కేటీఆర్ పాల్గొన్న నిరసనలకు లెక్కలేదు.. సమైక్య పాలకులు ఆయనపై పెట్టిన ఉద్యమ కేసులకు కొదవే లేదు.. ఇక అక్రమ అరెస్టులకైతే అంతే లేదు. ప్రజాక్షేత్రాన్నే ప్రధాన వేదికగా చేసుకుని కేటీఆర్ నిత్యం వినిపించిన రణన్నినాదం ఇప్పటికీ తెలంగాణ చరిత్ర పుటల్లో మార్మోగుతూనే ఉన్నది. ధర్నాలు, రాస్తారోకోలే కాదు, జాతీయ చానళ్లలో జరిగిన చర్చల్లో కూడా తెలంగాణ గోసను వినిపించి, ఢిల్లీ పెద్దలను మెప్పించి, ఒప్పించేలా సాగిన వాదనలు నేటికీ హస్తిన మీడియా సర్కిళ్లలో చర్చనీయాంశాలే.

ఇటీవల తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సెషన్ సందర్భంగా ఆవిష్కృతమైన కేటీఆర్ అరెస్టు దృశ్యాలు.. ప్రతిఒక్కరికీ ఉద్యమ జ్ఞాపకాలను గుర్తుచేశాయి. ఓవైపు ఇందిరమ్మ రాజ్యమని చెప్పుకొంటూ.. మరోవైపు మాజీ మంత్రులు, సీనియర్ శాసనసభ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను సీఎం, డిప్యూటీ సీఎం అవమానించేలా మాట్లాడిన తీరు మహిళా లోకాన్నే కాదు, తెలంగాణలోని ప్రతీఒక్కరి గుండెను గాయపరిచింది. ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పేవరకు విడిచిపెట్టేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సారథ్యంలో.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలోని సీఎం చాంబర్ ముందే బైఠాయించడంతో ప్రభుత్వం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇక చేసేది లేక మార్షల్స్‌ను రంగంలోకి దింపి అక్కడినుంచి కేటీఆర్ సహా ఇతర ఎమ్మెల్యేలను బలవంతంగా ఎత్తుకెళ్లి పోలీసు వ్యానుల్లో పడేసింది. మార్షల్స్ చుట్టుముట్టినా కేటీఆర్ పిడికిలెత్తి ముఖ్యమంత్రి నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు మాత్రం ఆపలేదు. సమైక్యరాష్ట్రంలో దర్శనమిచ్చిన ఇలాంటి దృశ్యాలు చూసి దశాబ్దం దాటిపోయింది.

పదేండ్లు ప్రశాంతంగా సాగిన తెలంగాణ అసెంబ్లీ.. ఈ సారి బడ్జెట్ సెషన్‌లో మాత్రం అట్టుడికింది. సమైక్యరాష్ట్రంలో నిరసనలకు కేంద్ర బిందువుగా నిలిచిన గన్‌పార్క్ మరోసారి ఆందోళనలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇందుకు ఆజ్యం పోసిన మరో కీలకాంశం జాబ్ క్యాలెండర్. తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఊరించి.. చివరికి ఉద్యోగాల ఊసు లేకుండా కాంగ్రెస్ సర్కారు ప్రకటించిన జాబ్ లెస్ క్యాలెండర్ యువత కోపాగ్నికి కారణమైంది. నిరుద్యోగులను నిలువునా దగా చేసిన కాంగ్రెస్‌పై అసెంబ్లీలోనే కాకుండా గన్‌పార్క్ వేదికగా యువత పక్షాన కేటీఆర్ జంగ్ సైరన్ మోగించారు.

> **ఓవైపు ఈసారి బడ్జెట్‌లో కాంగ్రెస్ వేసిన తప్పటడుగులను లెక్కలతో సహా ఎండగడుతూ కేటీఆర్ సంధించిన ప్రశ్నలు అధికార పక్షం తలలు పట్టుకునేలా చేశాయి. మరోవైపు అసెంబ్లీ లోపల, బయటా ఆయన సారథ్యంలో హోరెత్తిన నిరసనలు అధికార పక్షానికి ముచ్చెమటలు పట్టించాయి.**

తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ పోరాటం నుంచి.. నిరుద్యోగ యువత ఆశలపై నీళ్లు చల్లిన కాంగ్రెస్ సర్కారు నిర్వాకాన్ని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ముందు ఎండగట్టే వరకు.. ప్రతి అధ్యాయంలో అడుగడుగునా నాటి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించారు కేటీఆర్. పదేండ్ల క్రితం వరకు సమైక్యరాష్ట్రంలో అనుసరించిన పోరాట పంథానే గుండెల నిండా నింపుకొని కాంగ్రెస్ పాలకపక్షాన్ని గడగడలాడించారు. ఉద్యమాలే ఊపిరిగా పురుడుపోసుకున్న ఈ రాజకీయ చాణక్యుడి అలుపెరగని పోరాటం ప్రభుత్వాన్ని పూర్తిగా ఆత్మరక్షణలో పడేసింది. వ్యక్తిగత దూషణలే పతాక శీర్షికలుగా మారుతున్న ఈ రోజుల్లో.. వాటికి ఏ మాత్రం తావులేకుండా, ఎవరెంత రెచ్చగొట్టినా సబ్జెక్ట్ నుంచి ఏ మాత్రం డీవియేట్ కాకుండా లెక్కలతో సహా నిలదీయడంతో ప్రభుత్వం చిక్కుల్లో పడింది. కేటీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు, సంధించిన వాగ్బాణాలకు సమాధానం చెప్పే ధైర్యం లేక ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపి చివరికి నాలుక కర్చుకున్నది.

ఉద్యమ నాయకుడు కేసీఆర్ సారథ్యంలో అమరుల త్యాగాలతో తెచ్చుకున్న తెలంగాణ పదేండ్ల ప్రగతి ప్రస్థానంలోనూ చెరగని ముద్ర వేశారు కేటీఆర్. తెలంగాణ సాధనతోనే లక్ష్యం నెరవేరలేదని స్పష్టం చేస్తూ.. కోట్లాది మంది ఆకాంక్షలు నెరవేర్చేందుకు అహర్నిశలు శ్రమించారు. అన్నింటికన్నా ముఖ్యంగా హైదరాబాద్‌ను యువతకు ఉపాధి అవకాశాల గనిగానే కాదు, యావత్ దేశం ఖజానా నింపే అక్షయపాత్రగా తీర్చిదిద్దారు. ఉద్యమ స్ఫూర్తితో పనిచేయడం వల్లే అనతికాలంలోనే అద్భుత ఫలితాలు సాధించి విశ్వవేదికలపై శభాష్ అనిపించుకున్నారు.

(తెలంగాణ దళిత బహుజన చైతన్య వేదిక)

నేడు గద్దర్ వర్ధంతి

గద్దర్ ఓ యుద్ధగీతం

> **కత్తుల వంతెన మీద కవాతు చేసిన గద్దర్ (గుమ్మడి విఠల్‌రావు) పీడిత వర్గాల గొంతుకగా నిలిచారు. పాటనే అస్త్రంగా చేసుకొని ప్రజా ఉద్యమాల్లో సాంస్కృతిక విప్లవాన్ని సృష్టించారు. విప్లవోద్యమం, దళితోద్యమం, మలిదశ తెలంగాణోద్యమంలో అగ్గిగళంతో యుద్ధం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే త్యాగానికి, పోరాటానికి నిలువెత్తు ప్రతిరూపం గద్దర్.**

అసమానతల సమాజంలో గద్దర్ తన జననం నుంచి మరణం వరకు అసామాన్య పోరాటం సాగించారు. 1949లో నిరుపేద కుటుంబంలో జన్మించిన గద్దర్ పాలకులు, భూస్వాముల అణచివేత, దోపిడీని ధిక్కరించారు. నూనూగు మీసాల వయసు నుంచే బీఆర్ అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రలను అర్థమయ్యేరీతిలో ఒగ్గు కథలు, బుర్ర కథల రూపంలో వినిపించి మట్టి మనుషుల్లో చైతన్యం రగిలించారు. గోసి, గొంగళి, కాళ్లకు గజ్జెలు, చేతి కర్ర, ఎర్రజెండా కలగలిపిన ఆహార్యంతో గద్దర్ ఒక ట్రెండ్‌ను సృష్టించారు.